క్లుప్తంగా

నేడు పోలీస్ సురక్ష దినోత్సవం

అశ్వాపురం: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం హేమచంద్రాపురంలోని జిల్లా హెడ్ క్వార్టర్లలో నిర్వహించే పోలీస్ సురక్ష దినోత్సవాన్ని జయప్రదం చేయాలని అశ్వాపురం సీఐ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమానికి మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, యువత అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని, మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుంచి ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బస్సు సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి


మాట్లాడుతున్న రేపాకుల శ్రీనివాస్

చంద్రుగొండ: ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రం చంద్రుగొండలోని చనగచెరువు, ఊరచెరువుల్లో మట్టిపనులు చేస్తున్న కూలీలతో ఆయన శనివారం మాట్లాడారు. రోజుకు కనీసం కూలీ రూ.600 ఇవ్వాలని, ప్రనిప్రదేశంలో టెంట్లు, తాగునీటి సదుపాయం, మెడికల్‌కిట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు పెద్దిని వేణు, విప్పర్ల వెంకటేశ్వర్లు, రాయి రాజా, కంభంపాటి రాంబాబు, దాసరి సీతారాములు, అప్పారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అవార్డ్


అవార్డు అందుకుంటున్న కోటేశ్వరరావు

మణుగూరురూరల్: మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ కోటేశ్వరరావుకు జాతీయ కీర్తి పురస్కార్ అవార్డు దక్కింది. వివిధ అంశాల్లో ఆయన అందించిన సేవలకు గాను అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఆయనకు ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అవార్డు అందజేయగా ఎంఈఓ వీరస్వామి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు నాగశ్రీ, శ్రీలత, రామనాగశర్మ, పటేల్ లక్ష్మీనారాయణ అభినందించారు.

మొద్దులమాడలో ఫాగింగ్


ఫాగింగ్ చేస్తున్న జీపీ సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మొద్దులమాడలో శనివారం వైద్య శాఖ ఆధ్వర్యంలో ఫాగింగ్ చేపట్టారు. సీజనల్ వ్యాధులు, దోమల వ్యాప్తి నేపథ్యంలో వినాయకపురం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో గ్రామంలోని అన్ని వీధుల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేశారు. అనంతరం జ్వరాలు, పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరూ దోమ తెరలు వినియోగించాలని ఆయన సూచించారు.

ప్రగతిబాటలో ములకలపల్లి

ములకలపల్లి: ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరయ్యాయి. ఆరు నెలల వ్యవధిలో సుమరు రూ.30 కోట్లు మంజూరు కాగా, అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. పంచాయతీరాజ్ (పీఆర్) శాఖ విభాగంలో రూ.5.20 కోట్లతో పనులు చేపడుతున్నారు. మంగోపేట పీహెచ్‌సీకి అదనపు గది నిర్మాణానికి రూ.1.5 కోట్లు మంజూరయ్యాయి. ఉపాధి హామీ పథకంలో రూ.3.7 కోట్లు సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరు పనులు సాగుతున్నాయి. పీఆర్ ఏఈ శివలాల్ పనులను పర్యవేక్షిస్తున్నారు. రోడ్లు భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ)లో రూ.16.12 కోట్లు మంజూరు కాగా, కమలాపురం శివారులోని గాడెపువాగుతోపాటు గ్రామ శివారులోని వాగులపై మూడు వంతెనల నిర్మాణాలకు రూ.4.2 కోట్లు కేటాయించారు. మండలంలోని పొగళ్లపల్లి నుంచి తిమ్మంపేట వరకూ 9.1 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4.32 కోట్లు రాగా పనులు ఆరంభించారు. మారుమూల గ్రామాల రోడ్లకు కోట్లాది రూపాయలు మంజూరయ్యాయి. ఐటీడీఏ ఏఈ సుబ్బరాజు పర్యవేక్షణలో పనులు చేపడుతున్నారు.

రైతుల కళ్లల్లో ఆనందం చూడాలి..

- ప్రభుత్వ లక్ష్యం అదే..
- రైతు దినోత్సవ సభల్లో వక్తలు


అశ్వాపురం: ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు


అన్నపురెడ్డిపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ లలిత


దమ్మపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెచ్చా


భద్రాచలంటౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు


గుండాల: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, రైతులు తదితరులు

రైతుల కళ్లల్లో ఆనందం చూడటమే ప్రభుత్వ లక్ష్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రైతుదినోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు రైతుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన, పెడుతున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, పట్టాదారు పాస్‌పుస్తకాలు, మిషన్ కాకతీయ, వ్యవసాయ యాంత్రీకరణ, ఉద్యానవన పంటల సాగు, విత్తనాల రాయితీ తదితర పథకాలతో రైతులు లబ్ధి పొంది, ఆర్థిక ఎదగాలని వారు ఆకాంక్షించారు. అనంతరం అధిక దిగుబడులు సాధించిన రైతులను సత్కరించారు.

–సాక్షి నెట్‌వర్క్


చర్ల: దుమ్ముగూడెంలో ఆదర్శరైతు చిన్నారావును సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


చంద్రుగొండ: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, రైతులు, ప్రజాప్రతినిధులు తదితరులు


బూర్గంపాడు: మోరంపల్లిబంజర రైతువేదికలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు


చర్ల: తేగడ రైతువేదికలో మాట్లాడుతున్న తహసీల్దార్ భరణిబాబు


ములకలపల్లి: ఉత్తమ రైతును సత్కరిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తదితరులు


అశ్వారావుపేటరూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హ్యాండ్ రైటింగ్ శిక్షణ శిబిరం ప్రారంభం

మణుగూరురూరల్: మండలంలోని కూనవరంలోని ఎంపీయూపీఎస్‌లో భరోసా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత హ్యాండ్ రైటింగ్ కోచింగ్ సెంటర్‌ను సర్పంచ్ ఏనిక ప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హ్యాండ్ రైటింగ్ అనుభవజ్ఞులైనవారు ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు వారంరోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భరోసా వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు అమీనుద్దీన్, గౌరవ అధ్యక్షులు లింగబాబు, కార్యవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదం దిగ్భ్రాంతికి గురిచేసింది: విప్

మణుగూరురూరల్: ఒడిశా రాష్ట్రంలోని బాలాసోర్ జిల్లా బహనాగ రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం జరిగిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదం దిగ్భ్రాంతికి గురిచేసిందని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. ప్రమాదానికి గల కారణాలను గుర్తించి అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రైతుల రుణాలు మాఫీ చేయాలి

అశ్వాపురం: ప్రభుత్వం చేపట్టిన దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రుణమాఫీ చేస్తే రైతులు మరింత ఆనందపడే వారని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు చేయకపోవడం బాధాకరమన్నారు. రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని మిల్లర్లు వెంటనే దిగుమతి చేసేకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు గద్దల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు అందించాలి

భద్రాచలంఅర్బన్: అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను మంజూరు చేసి దశాబ్ది ఉత్సవాల్లోనే వారికి అందించే విధంగా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక లయన్స్‌క్లబ్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భద్రాచలం పట్టణంలో డబల్ బెడ్రూమ్ ఇళ్లు పూర్తయినా లబ్ధిదారులకు అందించడంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఐదేళ్ల నుంచి కొత్త రేషన్ కార్డులు మంజూరు కాకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, లబ్ధిదారులను ఎంపిక చేసి ఈ దశాబ్ది ఉత్సవాల్లోనే అందరికీ రేషన్ కార్డులు అందించాలని కోరారు. సమావేశానికి పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకటరామారావు అధ్యక్షత వహించగా పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు పారెల్లి సంతోష్‌కుమార్, పట్టణ కమిటీ సభ్యులు ఉస్తేల జ్యోతి, కుంజా శ్రీనివాస్, జీవనజ్యోతి, పార్టీ సభ్యులు ముత్యాలు, రమాదేవి, విజయ, చింతలపూడి రమేశ్, అజయ్, నిర్మల పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మచ్చ వెంకటేశ్వర్లు

రైతులను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం


మాట్లాడుతున్న సర్పంచ్ సతీశ్

మణుగూరురూరల్: రైతులను రాష్ట్ర ప్రభుత్వం మాయమాటలతో మోసం చేస్తోందని రామానుజవరం సర్పంచ్ బాడిశ సతీశ్ ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రామానుజవరం గ్రామపంచాయతీలో రైతుదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సతీశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రైతుల సమస్యలను పరిష్కరించడంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం వైఫల్యమైందని పేర్కొన్నారు. అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇప్పటివరకు పరిహారం, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. రైతుల ఇబ్బందులను తీర్చాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రామానుజవరం గ్రామపంచాయతీలో రైతువేదిక ఏర్పాటుకు స్థలం కేటాయించలేదని మండిపడ్డారు.

రెగ్యులర్ మెజిస్ట్రేట్‌ను నియమించాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ పోస్టును రెగ్యులర్ జడ్జితో భర్తీ చేయాలని బార్ అసోసియేషన్ బాధ్యులు కోరారు. ఈ మేరకు హైకోర్టు జడ్జి భీమపాక నగేశ్‌కు బీపీఎల్ గెస్ట్‌హౌస్‌లో శనివారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. దాదాపుగా 3 వేల క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉండగా, వంద మంది న్యాయవాదులు ప్రాక్టీస్ చేస్తున్నారని తెలిపారు. ఈ మేరకు సత్వర న్యాయం అందించేందుకు రెగ్యులర్ మెజిస్ట్రేట్‌ను నియమించాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటా దేవదానం, న్యాయవాదులు, ఆదివాసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చీమల నర్సింహారావు పాల్గొన్నారు.


జడ్జికి వినతిపత్రం అందిస్తున్న న్యాయవాదులు

ప్రజాపంథా ఆధ్వర్యంలో ధర్నా


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అశ్వాపురం: అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని, వితంతు, వృద్ధాప్య పింఛన్లు, కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని, ఇంటి స్థలాలు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. భాస్కర్, జీవన్, మధుసూదన్‌రెడ్డి, సాంబిరెడ్డి, వెంకటేశ్వర్లు, రాములు, రాజశేఖర్‌రెడ్డి, నరేశ్, రాజు, భీమయ్య, కీర్తి, శైలజ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అశ్వారావుపేటరూరల్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అశ్వారావుపేటలోని డ్రైవర్స్‌కాలనీకి చెందిన కొబ్బరికాయల వ్యాపారి సుబ్రహ్మణ్యం ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్తాపానికి గురై శనివారం కలుపు నివారణ మందు తాగాడు. దీంతో కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లి పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలించారు. కాగా, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన సమయాన వైద్యులు అందుబాటులో లేకపోవడంతో దాదాపు గంట పాటు వేచి ఉండాల్సి వచ్చిందని బంధువులు ఆరోపించారు.

బీటెక్ విద్యార్థికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

అశ్వాపురం: మండలంలోని నెల్లిపాకబంజర గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన లారీడ్రైవర్ కుమార్తె జి.సుబ్బలక్ష్మి బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతోంది. రెండో సెమిస్టర్ పరీక్ష ఫీజుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో భారజల కర్మాగారం గౌతమీస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థికి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కె.సోమయ్య, ఎం.ప్రదీప్, పెదిరెడ్ల శ్రీనివాస్, సర్పంచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బాల్య స్నేహితుడి కుటుంబానికి..


నగదు అందిస్తున్న నాగేశ్వరరావు బాల్య స్నేహితులు

అశ్వాపురం: మండలంలోని సవిటిగూడెం గ్రామానికి చెందిన భూక్యా నాగేశ్వరరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి ఆయన బాల్య స్నేహితులు అయిన 1994 – 95 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. శనివారం సవిటిగూడెంలో నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించి కుటుంబసభ్యులకు రూ.60 వేల నగదును అందించారు. కాగా, ఆర్థిక సాయం అందించిన నాగేశ్వరరావు స్నేహితులను ఈ సందర్భంగా గ్రామస్తులు అభినందించారు.

బడిబాట కార్యక్రమం ప్రారంభం


బూర్గంపాడు: ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం


దమ్మపేట: కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

బూర్గంపాడు: విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జాన్సన్ ఆధ్వర్యంలో బూర్గంపాడులోని అంబేద్కర్ కాలనీ, పాండవబస్తీ ఏరియాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, డిజిటల్ పరికరాలు, నాణ్యమైన విద్యాబోధన తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ గంగాభవాని పాల్గొన్నారు.

దమ్మపేట మండలంలో..

దమ్మపేట: మండలంలోని లింగాలపల్లి, మల్లారం, దమ్మపేట గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ కీసర లక్ష్మి, హెచ్‌ఎం మస్తాన్, విద్యా కమిటీ చైర్మన్ పాకనాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


చంద్రుగొండ: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలి


చంద్రుగొండ: పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవాలని మండల విద్యాశాఖాధికారి సత్తెనపల్లి సత్యనారాయణ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. వీధుల్లో పిల్లలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బడిఈడు పిల్లలు బయట ఉండవద్దని పాఠశాలల్లో ఉండాలని కోరారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతూ పిల్లలను పాఠశాలలకు పంపించాలని కోరారు.

ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించని అధికారులు

చర్ల: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణాపై ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అక్రమ రవాణాదారులకు కొమ్ముకాస్తున్నారని ఆదివాసీ సేనా జిల్లా అధ్యక్షుడు యలకం రామకృష్ణ ఆరోపించారు. శనివారం దుమ్ముగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అమాయక గిరిజనులను అడ్డుపెట్టుకొని అందినకాడికి దోచుకుంటూ గిరిజన సొసైటీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా కొనసాగుతున్న ఇసుక రవాణాపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.


అటెన్షన్ ప్లీజ్

ఎప్పటికి పూర్తయ్యేనో..?



మండలంలోని మనుబోతుల గూడెంలో 20 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. గ్రామంలో 2018లో రూ.1.08 కోట్లతో 20 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి. ఐదేళ్లయినా ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తికాలేదు. ఇళ్లు ఎప్పుడు నిర్మిస్తారో? ఎప్పుడు కేటాయిస్తారో? తెలియడం లేదని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణం వ్యయం పెరగడంతో సంబంధిత కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదని సమాచారం. పాత టెండర్ల రద్దుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో అసంపూర్తిగా నిలిచిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

-అశ్వాపురం

ప్రశ్నించాల్సిన అధికారి : ఎంకే ప్రసాద్, ఏఈ ఐటీడీఏ
సెల్ నంబర్ : 79898 04659